తోలుకట్టాలో పంటల సాగును పరిశీలిస్తున్న డీఏవో గీతారెడ్డి

ఈ నెలాఖరు వరకు పీఎం కిసాన్‌కు ఈ-కేవైసీ చేయించుకోవాలి

రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

మొయినాబాద్, ఫిబ్రవరి 21 : రైతులు ఈ నెలాఖరు వరకు పీఎం కిసాన్‌కు ఈ-కేవైసీ చేయించుకోవాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నక్కలపల్లి, తోలుకట్టా గ్రామాలను సందర్శించి పంటలను పరిశీలించారు. నక్కలపల్లిలో పీఎం కిసాన్ పథకానికి ఈ-కేవైసీ చేస్తుండగా సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకు రైతులెవరైనా పీఎం కిసాన్‌కు ఈ-కేవైసీ చేయించుకోలేదో.. తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. ఈ-కేవైసీ చేయించుకోకపోతే పీఎం కిసాన్ పథకం డబ్బులు రావని పేర్కొన్నారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. రబీ సీజన్‌లో వరినాట్లు వేయడం ఆలస్యమైందని.. ఎండలకు వాతావరణంలోని మార్పులవల్ల చీడ పీడలు పంటకు ఆశించే అవకాశం ఉందని తెలిపారు. పంటకు తగిలిన తెగుళ్లను గుర్తించి వెంటనే రసాయన మందులను పిచికారీ చేయాలన్నారు. పంట ఎదుగుదలకు కావాల్సిన ఎరువులను వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని పంటకు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, రైతులున్నారు.

కాంగ్రెస్ గ్యారెంటీ చెల్లుబాటు కాదు

- వందేండ్లు దాటిన ఎక్స్‌పైరీ పార్టీ కాంగ్రెస్
- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్

పరిగిలో జరిగి సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న లక్ష్మణ్

పరిగి, ఫిబ్రవరి 21 : కాంగ్రెస్ పార్టీ వ్యారెంటీ అయిపోయిందని, వందేండ్లు దాటిన కాంగ్రెస్ పార్టీకి ఎక్స్‌పైరీ డేట్ అయిపోయిందంటూ బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ గ్యారెంటీ చెల్లుబాటు కాదని, ఈ దేశంలో ఏదైనా చెల్లుబాటు అవుతుందంటే మోదీ గ్యారెంటీయేనన్నారు. మాటపై నిలబడే వ్యక్తి ప్రధాని మోదీ అని పేర్కొన్నారు.

బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప బస్సు యాత్రలో భాగంగా బుధవారం పరిగిలో జరిగిన సభలో లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. విధానపరమైన వాటిపై కాకుండా చవకబారు విమర్శలు చేసే రాహుల్‌గాంధీకి సమాజంలో పేదవారి బతుకులపై కనీస అవగాహన లేదన్నారు. నరేంద్రమోదీ వేసిన రహదారుల్లో రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ వంశపారంపర్య రాజకీయాలకు నెలవుగా నిలిచిందని విమర్శించారు. అధికారం కోసం పార్టీలు మారేవారిని ప్రజలు నమ్మరన్నారు. చేసేది చెప్పడం, చెప్పింది చేసి చూపించడం కేవలం ప్రధాని నరేంద్ర మోదీ వల్లనే సాధ్యమన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. చేవెళ్లను ఆదర్శవంతమైన పార్లమెంటు నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చారిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకొని ప్రజల హృదయాల్లో నిలిచారన్నారు. తెలంగాణ నుంచి నలుగురు ఎంపీలుంటే పది లక్షల కోట్ల నిధులు వచ్చాయని లక్ష్మణ్ పేర్కొన్నారు.

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంటును సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతగా తీసుకున్నారని, అభ్యర్థి లేక పక్క పార్టీ నుంచి అడుక్కొచ్చుకున్నారని విమర్శించారు. చిల్లుపడ్డ ముంతలో చెల్లని పైసలు వేసి ఊపినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం పని ఉందని పేర్కొన్నారు. ప్రజలందరూ నరేంద్ర మోదీ వైపు చూస్తున్నారని చెప్పారు.

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇంతో అంతో రాష్ట్రం నడుస్తుందంటే ప్రధాని నరేంద్ర మోదీ వల్లనేనని, సీఎం రేవంత్‌రెడ్డి చిప్ప పట్టుకొని తిరుగుతున్నాడని, ప్రజలకు నష్టం కావద్దని ప్రధాని మోదీ 9వేల కోట్ల అప్పుకు అనుమతి ఇచ్చారన్నారు. లేదంటే ఇంట్లో లైటు బుగ్గలు వెలగకపోయేది, పొలాల్లో కరెంటు ఉండకపోయేది, ఆర్టీసీ బస్సుల్లో పోసేందుకు డీజిల్ ఉండకపోయేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, సీనియర్ నాయకులు రాణి రుద్రమ, మారుతీ కిరణ్, ప్రహ్లాదరావు, మల్లారెడ్డి, స్థానిక నాయకులు నర్సింహ, పెంటయ్యగుప్తా, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

కష్టపడితే ఏదైనా సాధించవచ్చు

ఒకే యువకుడు.. మూడు ప్రభుత్వ ఉద్యోగాలు

వంకూరి సురేశ్

ఆమనగల్లు, (తలకొండపల్లి) ఫిబ్రవరి 21 : జీవితంలో ప్రభుత్వ ఉద్యోగమే తమ లక్ష్యంగా భావించేవారు ఎంతో మంది ఉంటారు. కానీ ఒక్కసారి విఫలం అయిన వెంటనే నిరాశ చెందుతారు. కాని ఎలాంటి నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా కష్టపడితే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు ఓ యువకుడు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామానికి చెందిన వంకూరి సురేశ్ ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై తన ప్రతిభను చాటుకున్నాడు. వంకూరి జంగయ్య-ఆండాళు దంపతుల పెద్ద కుమారుడు సురేశ్ ఇంజినీరింగ్ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంతో కష్టపడి చదివాడు. మొదటగా కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం రాగా.. ఇటీవల వెల్లడైన గురుకుల పాఠశాలలో లైబ్రేరియన్‌గా, తదుపరి వెల్లడైన గురుకుల జూనియర్ కళాశాలలో లైబ్రేరియన్‌గా ఎంపికయ్యాడు. ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో సురేశ్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఏఆర్ ఎస్సీటీపీసీలకు శిక్షణ

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ జిల్లా శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ అదనపు ఎస్పీ మురళీధర్

వికారాబాద్, ఫిబ్రవరి 21 : ఆసిఫాబాద్, సిద్ధిపేట, రామగుండం జిల్లాల నుంచి 224 మంది శిక్షణ కోసం మన జిల్లా శిక్షణా కేంద్రానికి వచ్చారని వికారాబాద్ జిల్లా శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ అదనపు ఎస్పీ మురళీధర్ తెలిపారు. బుధవారం ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు శిక్షణకు వచ్చిన పోలీస్ అభ్యర్థులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా శిక్షణా కేంద్రాన్ని పలుమార్లు పరిశీలించి శిక్షణకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులను అభినందించి, శిక్షణా కేంద్రంలో రోజువారీగా జరిగే శిక్షణ విషయాలను వివరించారు. అభ్యర్థులు శిక్షణా కేంద్రంలో పాటించాల్సిన నియమ నిబంధనలు, క్రమశిక్షణపై అవగాహన కల్పించారు. ఆసిఫాబాద్ నుంచి 55, రామగుండం నుంచి 109, సిద్దిపేట నుంచి 60 మొత్తం 224 మంది అభ్యర్థులు శిక్షణ కోసం వచ్చారు. కార్యక్రమంలో డీటీసీ సీఎల్ఐ వెంకట్రాంనాయక్, ఆర్ఎస్సై వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణకు హాజరైన ఎస్సీటీపీసీ అభ్యర్థులు

ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

కడ్తాల్, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలో కొలువైన లక్ష్మీచెన్నకేశవస్వామి వారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, లలితా సహస్రనామ పారాయణం, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

కల్యాణోత్సవానికి ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే లక్ష్మీచెన్నకేశవస్వామివారి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ తిరునగరి వేణుగోపాల్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆంజనేయులు తెలిపారు. తెల్లవారుజామున 3 గంటలకు శివాలయం వద్ద అగ్నిగుండాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక అర్చకులు శ్రీమన్నారాయణ, శ్రీధర్, పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు.

వణికిస్తున్న మంప్స్

- చిన్నారుల్లో పెరుగుతున్న కేసులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 21 : మంప్స్ (గవద బిళ్లలు) వ్యాధి వణికిస్తున్నది. చాలామంది చిన్నారులు దవడ వాపులతో తల్లడిల్లుతున్నారు. దీంతో వారి తల్లిదండ్రులు దవాఖానల బాట పడుతున్నారు. గత ఏడాది నవంబర్ నుంచి ఈ కేసులు తరచూ నమోదవుతున్నాయి. జ్వరం, జలుబు, దగ్గు అనగానే మంప్స్ అని భయపడాల్సిన అవసరం లేదని, వ్యాధిపై క్షేత్రస్థాయిలోనూ అవగాహన కల్పిస్తున్నామని వైద్యులు చెబుతున్నారు.

భయపడుతున్న తల్లిదండ్రులు

మంప్స్ అనేది ఒకరి నుంచి ఇతరులకు వచ్చే అవకాశాలు ఉండటంతో తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇంట్లో ఒక చిన్నారికి వస్తే వారంలోనే మరొకరు అదే వ్యాధి బారిన పడిపోతున్నారు. మంప్స్ లక్షణాలున్నవారిని తల్లిదండ్రులు బడులకు పంపిస్తుండటంతో అది తరగతి గదిలోని మిగతా వారికి సోకే ప్రమాదం పొంచి ఉన్నది. రెండు నుంచి నాలుగు రోజులపాటు చెవుల కింద దవడల భాగంలో వాపు ఉంటుందని, సరైన మెడిసిన్ తీసుకుంటే వారంలో మళ్లీ సాధారణ స్థితికి వచ్చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. బయటి వస్తువులు తినిపించకూడదని, చేతులను సరైన రీతిలో శుభ్రం చేసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇది సీజనల్‌గా వచ్చే వ్యాధి మాత్రమేనన్నారు.

బస్తీ దవాఖానలు, పల్లె దవాఖానల్లో తక్కువ కేసులు నమోదవుతుండగా.. ప్రైవేటు చిల్డ్రన్స్ హాస్పిటల్స్‌లో ఎక్కువ కేసులే నమోదవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేటు బడుల్లోనూ మంప్స్ కేసులు కనిపిస్తున్నాయి. జ్వరాలు, ఇతర లక్షణాలు కనిపించినా బడులకు పంపిస్తుండటం, వారు తోటి విద్యార్థులతో కలిసి దగ్గరగా తిరుగుతుండటంతో ఒకరి నుంచి మరొకరికి వ్యాధి సోకే ప్రమాదం ఉన్నదని వైద్యులు చెబుతున్నారు. తీవ్రమైన జ్వరం, జలుబు, దగ్గు, దవడల వాపు, నొప్పి, ఒంటి నొప్పులు, తలనొప్పి తదితర లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు చెబున్నారు.

భయపడే అవసరంలేదు

మంప్స్ అనేది ఓ సీజనల్ వ్యాధి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే పల్లె, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ కేంద్రాల్లో వైద్యులను సంప్రదించండి. ప్రాథమికంగా వాటిని మంప్స్‌గా గుర్తిస్తే వనస్థలిపురంలోని ఏరియా దవాఖానకు తీసుకెళ్లండి. అక్కడ పిడియాట్రీషియన్ అందుబాటులో ఉంటారు. ప్రతీది మంప్స్ కాదు.. ఇన్వెస్టిగేషన్ చేశాకే అది మంప్సా? కాదా? తెలుస్తుంది. పరీక్షలు నిర్వహించి, సరైన మందులు అందజేస్తారు. గవద బిళ్లలకు పారాసిటమల్, యాంటీబయాటిక్స్ వాడితే సరిపోతుంది. పెద్దగా భయపడాల్సిన అవసరంలేదు. పిల్లలు బయటి వస్తువులు తినొద్దు. చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. దగ్గు, జలుబు, జ్వరం, దవడ వాపులు వస్తే వెంటనే స్థానిక దవాఖానలను సంప్రదించాలి. ఇతర చిన్నపిల్లలతో కలిసి తిరగనివ్వకపోవడం మంచిది. అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలతో వివిధ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. కేసులు తక్కువే నమోదవుతున్నాయి.

- డాక్టర్ ధరణికుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఇబ్రహీంపట్నం డివిజన్

గురుకులాల స్థలాల పరిశీలన

కొడంగల్, ఫిబ్రవరి 21 : నియోజకవర్గ పరిధిలో నిర్వహించే అభివృద్ధి పనుల స్థలాలను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ శాంతకుమారి బుధవారం నియోజకవర్గ పరిధిలో పర్యటించి పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ ప్రాంతంలోని ఎడ్యుకేషన్ హబ్ స్థలాన్ని పరిశీలించారు. ఎడ్యుకేషన్ హబ్ ప్రాంతంలో ఇదివరకే నిర్మించిన ఎస్టీ గురుకుల పాఠశాల స్థలంతో పాటు నిర్మించే ఎస్సీ గురుకుల, మైనార్టీ గురుకుల స్థలాన్ని ఆమె పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలను అందించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో 'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు. మంజూరైన అభివృద్ధి పనుల నిర్వహణకుగాను ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాండూరు ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పాతకొడంగల్ వద్ద ఎడ్యుకేషన్ హబ్ స్థలాన్ని పరిశీలిస్తున్న చీఫ్ సెక్రెటరీ శాంతకుమారి

బదిలీపై వెళ్తున్న ఆరిఫుద్దీన్‌ను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్, పాత్రికేయులు

అంకితభావంతో పనిచేసినప్పుడే సంతృప్తి

వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 21 : ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పని చేసినప్పుడే విధి నిర్వహణలో సంతృప్తి కలిగిస్తుందని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గద్వాల్ జిల్లాకు బదిలీపై వెళ్లిన జిల్లా పౌర సంబంధాల అధికారి మహ్మద్ ఆరీఫుద్దీన్‌కు పాత్రికేయులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అధికారులు, పాత్రికేయులతో సమన్వయపరుచుకొని ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించడంలో డీపీఆర్వో ఆరీఫుద్దీన్ కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

ఆరీఫుద్దీన్ సౌమ్యుడిగా ఉంటూ అందరినీ కలుపుకొని పనిచేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పాత్రికేయులను సమన్వయపరచుకొని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తన విధులను నిర్వహించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి అమరేందర్ కృష్ణ, సహాయ పౌర సంబంధాల అధికారి ప్రభాకర్, కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, సతీష్‌కుమార్, నాగలక్ష్మి, దస్తమ్మ పాల్గొన్నారు.

పరీక్షా తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 21: ఓయూ పరిధిలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్షా తేదీలను మార్చినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను ఈ నెల 26 నుంచి నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించినప్పటికీ పలు కారణాల రీత్యా వాటిని వాయిదా వేసినట్లు చెప్పారు. పరీక్షలను తిరిగి వచ్చే నెల 1వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఓయూ పరిధిలోని బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 28 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 21: ఓయూ టెక్నాలజీ కళాశాలలో పార్ట్‌టైం లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత సాయిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఫుడ్ టెక్నాలజీలో మూడు పోస్టులు, ఫార్మసీ విభాగంలో ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. యూజీసీ, ఏఐసీటీఈ నిబంధనల మేరకు అర్హతలు ఉండాలని స్పష్టం చేశారు. ముందుగా రాతపరీక్ష నిర్వహించి, డెమో క్లాస్ ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. దరఖాస్తులను ఈ నెల 22వ తేదీలోగా తన కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఓయూ ఆర్ట్స్ కళాశాలలోని ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ సెంటర్ (ఈఎల్‌టీసీ)లో సర్టిఫికెట్ కోర్సుకు విదేశీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ కోర్సు తరగతులు రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు వరకు నిర్వహిస్తామని వివరించారు. ఆసక్తి ఉన్నవారు 9963528216, 9393059033 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

వికారాబాద్, ఫిబ్రవరి 21 : ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలతో ముందుకు వెళుతున్నదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చి మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థులకు కావాల్సింది ఆరు గ్యారెంటీలు కావని.. ఫీజులు, స్కాలర్‌షిప్‌లని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు భవిష్యత్తు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిగణేశ్, పట్టణ జాయింట్ సెక్రెటరీ జగదీశ్‌చారి, అనిల్, ఆదికేశవ, మంజునాథరెడ్డి, మురళి, కార్తీక్, శ్రీధర్, సంజీవ్ పాల్గొన్నారు.

హెచ్‌సీజీ ఆధ్వర్యంలో సైక్లింగ్ రైడ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : కశ్మీర్ టూ కన్యాకుమారి సైక్లింగ్ రైడ్ విజయవంతంగా మూడు సార్లు పూర్తి చేసిన సందర్భంగా హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్ (హెచ్‌సీజీ) సభ్యులు బుధవారం నెక్లెస్ రోడ్డులో సైక్లింగ్ రైడ్ నిర్వహించారు. సైక్లింగ్‌ను ప్రోత్సహించడంలో భాగంగా మరిన్ని సైక్లింగ్ రైడ్‌లు నిర్వహించనున్నట్టు ఫౌండర్ రవీందర్ తెలిపారు. మార్చి 3న హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్ ఏడో వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు

రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 21 : జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు నిల్వ ఉన్నాయని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి తెలిపారు. బుధవారం చేవెళ్లలోని పలు ఎరువుల షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపుల్లోని ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, ఈ పాస్ యంత్రాలను పరిశీలించారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డీలర్లందరూ ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరువుల అమ్మకాలు జరపాలని, రైతులకు సరిపడా ఎరువులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని డీఏవో సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల మండల ఏవో తులసి ఉన్నారు.

జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు మరో నామినేషన్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ రెండో రోజు ఒక నామినేషన్ దాఖలైంది. తొలి రోజు బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు తొమ్మిది మంది నామినేషన్ దాఖలు చేశారు. ఆవుల రవీందర్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, కంది శైలజ, సబీహాబేగం, మన్నె కవితారెడ్డి, లాస్య దూసరి, బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, చింతల విజయశాంతి, సబితా కిశోర్ నామినేషన్ వేశారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీలో ఉన్న అర్చన నామినేషన్ వేశారు. ఈ నెల ఈ 28వ తేదీన ఉదయం 11 గంటలకు నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఆదివారం మినహా మిగిలిన రోజులు నామినేషన్లను అధికారులు స్వీకరిస్తారు. కాగా చివరగా బీఆర్ఎస్ నుంచి దాఖలు చేసిన వారిలో 8 మందికే అవకాశం ఉండగా.. పది మంది వరకు వేయడంతో చివరి నిమిషంలో వేసిన నామినేషన్ ఉపసంహరించుకుంటారా.. లేకపోతే ఎన్నిక అనివార్యమవుతుందా.. అన్నది ఉత్కంఠగా మారింది.

మార్చి 10న జ్యోతిష్య అవార్డులు ప్రదానం

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 21 : ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో, ఆర్యన్ ఆస్ట్రాలజీ రిసెర్చ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో జ్యోతిష్య రంగంలో రాణిస్తున్నవారికి మార్చి 10న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జ్యోతిష్య శిరోమణి, జ్యోతిష్య భీష్మ, జ్యోతిష్య విశారద, జ్యోతిష్య బ్రహ్మ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు డా.నరసింహస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్ట్రాలజీ టాపిక్స్, రెమిడ్స్ తదితర అంశాలపై సెమినార్ ఉంటుందని వెల్లడించారు. అవార్డుల కోసం అర్హులైనవారు ఈ నెల 25లోపు 9652475566లో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రాజెక్ట్ తరాషా ఎగ్జిబిషన్ ప్రారంభం

బంజారాహిల్స్,ఫిబ్రవరి 21: గ్రామీణ హస్తకళలను ప్రోత్సహించడంతో పాటు వారు తయారు చేసే ఉత్పత్తులను వినియోగదారులకు పరిచేయం చేసే లక్ష్యంగా బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు కొనసాగే ' ప్రాజెక్ట్ తరాషా' కళాకృతుల ప్రదర్శనను ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్.రాజమౌళి సతీమణి రమా రాజమౌళి బుధవారం ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈ నెల 24 వరకు కొనసాగనున్నదని నిర్వాహకుడు శ్రీధర్ తెలిపారు.


హస్త కళాప్రదర్శనను తిలకిస్తున్న రమా రాజమౌళి

22, 23 తేదీల్లో జాతీయ సదస్సు

మాదన్నపేట, ఫిబ్రవరి 21 : సస్టైనబుల్ అగ్రికల్చర్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కోసం స్మార్ట్ టెక్నాలజీస్‌పై ఈ నెల 22, 23 తేదీల్లో జాతీయ సదస్సును సంతోష్‌నగర్‌లోని క్రీడా(సీఆర్ఐడీఏ)లో హైదరాబాద్ ఇండియన్ సొసైటీ ఆఫ్ ఆగ్రోఫిజిక్స్, ఢిల్లీ ఐసీఆర్-సీఆర్ఐడీఏ సంయుక్తంగా నిర్వహిస్తునట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా,అనలిటిక్స్, డ్రోన్‌లు, రిమోట్ సెన్సింగ్, సెన్సార్‌లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లతో సహ వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థ, సహజ వనరులు, నిర్వహణలో ఆధునిక డిజిటల్ సాంకేతికతలను సమగ్రపరచడం, డిజిటలైజేషన్‌లపై సెమినార్ ఉంటుందన్నారు

భారతీయ సంస్కృతికి ప్రతిబింబం సంస్కృత భాష

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 21 : భారతీయ సంస్కృతికి ప్రతిబింబం ప్రాచీన సంస్కృత భాష అని సంస్కృత అకాడమీ సంచాలకుడు ఆచార్య కాశొజ్జుల నీలకంఠం అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా తెలంగాణ సారస్వత పరిషత్తులో ప్రముఖ సంస్కృత పండితుడు ఆచార్య ముదిగంటి గోపాల్‌రెడ్డి సాహితీ పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య నీలకంఠానికి ప్రదానం చేశారు. పురస్కారం కింద 25వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రసంగిస్తూ.. సంస్కృత భాషా సాహిత్యాలలో గోపాల్‌రెడ్డి ప్రపంచ ప్రసిద్ధుడైన పండితుడిగా పేరుపొందారన్నారు. కార్యక్రమంలో పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య, ప్రాచీన రాతప్రతుల గ్రంథాలయం పూర్వ సంచాలకులు ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్యం, గోపాల్‌రెడ్డి సతీమణి ప్రముఖ రచయిత్రి డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి ఉన్నారు.

సాహితీవేత్త ఆచార్య నీలకంఠానికి సాహితీ పురస్కారం ప్రదానం చేస్తున్న శివారెడ్డి, చెన్నయ్య, సుజాతారెడ్డి

108 దివ్యదేశాల బ్రహ్మోత్సవాలు

శంషాబాద్ మండలం ముచ్చింతల్ శ్రీరామనగరంలోని 108 దివ్యదేశాల ద్వితీయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు భక్తులకు చిన్నజీయర్‌స్వామి అన్నప్రసాదం చేశారు. బుధవారం ధ్వజారోహణ కార్యక్రమంతో ప్రారంభమై రామచంద్రప్రభువుకు సూర్యప్రభ వాహన సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

- శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 21